www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1 వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 49 | 28-7-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/-



## లోక్‌సభలో పేపర్ లీకేజీ సవరణ బిల్లు

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్ఠంభన
- మోడీ, అమిత్‌షా క్షమాపణలకు విపక్షాల డిమాండ్

4



## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- రాహుల్ గాంధీ డిమాండ్

4

# ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు

విద్యార్థుల సంక్షేమమే మా లక్ష్యం

- ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావు
- ప్రతి విద్యార్థికి పోషకాహారం
- మూడునెలల్లో రాష్ట్రవ్యాప్తంగా పథకం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా ఆకలితో లేదా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లాలో సోమవారం ఈ పథకాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

- ఖమ్మం, జూలై 27

02

## ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం



02





## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ రంగనాథ్ క్షమాపణలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

2


## పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన కేసీఆర్, సీతక్క

యశోద ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నేతలు

కుటుంబ సభ్యులకు మనోధైర్యం.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

2





## కేంద్రం హామీలు బుట్టదాఖలు

4

- కేసుల ఉపసంహరణపై కదలిక లేదు
- దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ హెచ్చరిక
- విద్యార్థులకు న్యాయసాయం కోసం 'సాక్షి' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

## బంగాళాఖాతంలో అల్పపీడనం

తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

2

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు


3



## కృష్ణా జలాల్లో వాటాకు ఏపీ డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఏపీ
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

2





3

## పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం

ఈ-సిటీ, మంఖాల్, మహేశ్వరం పారిశ్రామిక పార్కుల్లో సీఎస్ సంజయ్ జాజు విస్తృత పర్యటన

పెట్టుబడులు, తయారీ సామర్థ్యం, ఉపాధి కల్పనపై సమీక్ష

## డ్రగ్స్ మత్తులో పోలీసులపై దూసుకెళ్లిన కారు

- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు..
- ఇన్‌స్పెక్టర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- హత్యాయత్నం కేసులు నమోదు..
- నిందితుడు సైఫ్ అరెస్ట్

2





ఉద్యమ కెరటం
మంగళవారం
28 జూలై 2026



# ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

## కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 27:** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన కేసీఆర్, సీతక్క

## యశోద ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నేతలు

## కుటుంబ సభ్యులకు మనోధైర్యం.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్, జూలై 27:** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం యశోద ఆస్పత్రిలో పరామర్శించి అడిగి తెలుసుకున్నారు. తీవ్ర గుండెపోటుతో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఎర్రవెల్లిలోని తన నివాసం నుంచి యశోద ఆస్పత్రికి చేరుకున్న కేసీఆర్.. వైద్యులతో మాట్లాడి పెద్ది ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మరోవైపు రాష్ట్ర మంత్రి సీతక్క కూడా యశోద ఆస్పత్రికి చేరుకుని పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ కూడా మరోసారి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, ఆదివారం ఉదయం హనుమకొండలోని తన నివాసంలో పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు తొలుత సమీపంలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. అక్కడ కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యులు అత్యవసర చికిత్స, సీపీఆర్ అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

# కృష్ణా జలాల్లో వాటాకు ఏపీ డిమాండ్

## బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఏపీ

**న్యూఢిల్లీ, జూలై 27:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- విద్యార్థుల సంక్షేమమే మా లక్ష్యం
- ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావు
- ప్రతి విద్యార్థికి పోషకాహారం
- మూడునెలల్లో రాష్ట్రవ్యాప్తంగా పథకం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూలై 27:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

## కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం

## ఆయన ఆ పోస్టులో కొనసాగడం సరికాదు

## లోతుకుంట భూములపై హైకోర్టు విచారణ




**హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# డ్రగ్స్ మత్తులో పోలీసులపై దూసుకెళ్లిన కారు

## హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు..


## ఇన్‌స్పెక్టర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

## హత్యాయత్నం కేసులు నమోదు.. నిందితుడు సైఫ్ అరెస్ట్

**హైదరాబాద్, జూలై 27:** డ్రగ్స్ మత్తులో ఉన్న ఓ యువకుడు తనను అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులపై కారుతో దూసుకెళ్లిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడగా, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడు సైఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు సమాచారం అందడంతో ఆయన ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసింది. ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అబిడ్స్‌కు చేరుకోగా, కారులో ఉన్న వ్యక్తికి మరో వ్యక్తి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే మాటువేసిన పోలీసులు ప్యాకెట్ అందించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కారులో ఉన్న వ్యక్తిని బయటకు రావాలని ఆదేశించారు. అయితే కారు పక్కకు తీస్తున్నట్లు నటించిన నిందితుడు ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా వాహనం నడిపాడు. ఈ క్రమంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై కారును ఎక్కించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మరో కానిస్టేబుల్ కూడా స్వల్ప గాయాలపాలయ్యారు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, పోలీసులు వెంటాడి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారును అడ్డగించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌గా గుర్తించారు. గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌ను సోమాజిగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఆయన కాలుకు ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేందర్ ఫిర్యాదు మేరకు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. డ్రగ్స్ వ్యవహారంతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

## తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



హైదరాబాద్, జూలై 27 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

**న్యూఢిల్లీ, జూలై 27:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీకి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూ



సుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సర్కార్ అండ?

- హైకోర్టు తీర్పుపై అప్పీల్‌కు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- న్యాయ నిపుణులతో చర్చలు.. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించే యోచన
- హైడ్రా రద్దు చేయాలని బీజేపీ డిమాండ్

**హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. హైడ్రా కమిషనర్‌కు ప్రభుత్వ మద్దతు కొనసాగనున్నట్లు తెలుస్తుండగా, హైకోర్టు తీర్పుపై అప్పీల్ దాఖలు చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. సమాచారం మేరకు, ఈ అంశంపై న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్‌ను న్యూఢిల్లీకి పంపినట్లు సమాచారం. అలాగే గతంలో నమోదైన కోర్టు ధిక్కరణ పిటిషన్లు, సంబంధిత న్యాయపరమైన అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు పూర్తి తీర్పు కాపీ అందిన అనంతరం సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాలు చేసే అవకాశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి



తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లను ప్రస్తావించిన ధర్మాసనం, అర్హత కలిగిన అధికారిని కమిషనర్‌గా నియమించాలని సూచించింది. రంగనాథ్ అదే పదవిలో కొనసాగితే చట్ట పాలనకు విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉండగా, హైడ్రా వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేసింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. పేదల ఇళ్లనే హైడ్రా లక్ష్యంగా చేసుకుందని, ప్రభావశీలుల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఫాతిమా కాలేజీ వంటి అంశాల్లో హైడ్రా వ్యవహరించిన తీరుపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలో పేదల ఇళ్ల రక్షణ కోసం హైడ్రాను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, హైకోర్టు ఆదేశాలను ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ స్వాగతించాయి. ప్రభుత్వం తదుపరి ఎలాంటి న్యాయపరమైన చర్యలు చేపడుతుందనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం

- ఈ-సిటీ, మంఖాల్, మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో సీఎస్ సంజయ్ జాజు విస్తృత పర్యటన
- పెట్టుబడులు, తయారీ సామర్థ్యం, ఉపాధి కల్పనపై సమీక్ష
- పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్, జూలై 27:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు తయారీ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు పేర్కొన్నారు. ఈ-సిటీ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, మంఖాల్ ఇండస్ట్రియల్ పార్క్, మహేశ్వరం జనరల్ పార్క్‌లలోని పలు ప్రముఖ పరిశ్రమలను ఆదివారం ఆయన సందర్శించి ఉత్పత్తి కార్యకలాపాలు, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై సమీక్ష నిర్వహించారు. టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, ప్రభుత్వ కార్యదర్శులు, టీజీఐఐసీ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో సీఎస్ వెంట పాల్గొన్నారు. ముందుగా ఈ-సిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించిన సీఎస్, సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీ ప్రక్రియను పరిశీలించారు. రూ.1,240 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఈ సంస్థలో ప్రస్తుతం 1,200 మందికి ఉపాధి లభిస్తోందని అధికారులు వివరించారు. అనంతరం 4 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించి హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల తయారీని పరిశీలించారు. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఈ సంస్థ 400 మందికి ఉపాధి కల్పిస్తోంది. తర్వాత




మంఖాల్ పారిశ్రామిక పార్కులోని చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ యూనిట్‌ను సందర్శించిన సీఎస్, బీఓపీపీ, బీఓపీఈటీ ఫిల్మ్ తయారీతో పాటు కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్, రీసైక్లింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. రూ.284.02 కోట్ల పెట్టుబడితో నడుస్తున్న ఈ సంస్థలో 500 మందికి ఉపాధి లభిస్తోంది. అనంతరం మహేశ్వరం జనరల్ పార్కులోని విప్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించిన సంజయ్ జాజు, తయారీ యూనిట్ పనితీరును పరిశీలించారు. రూ.174.34 కోట్ల పెట్టుబడితో ఈ సంస్థలో 331 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. చివరగా మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను సందర్శించిన సీఎస్, అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. 3.7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సంస్థ రూ.374.05 కోట్ల పెట్టుబడితో 2,782 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన సీఎస్ సంజయ్ జాజు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి పురోగతిని సమీక్షించారు. తెలంగాణ తయారీ రంగాన్ని బలోపేతం చేయడంలో, భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో, ఉపాధి అవకాశాల కల్పనలో ఈ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అభినందించారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి మరింత వేగం తీసుకొచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.



# మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలు

**మరింత సౌకర్యవంతంగా స్టేషన్లకు రూపకల్పన**

**అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 27:** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ఎ÷-లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షితమైన , ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

**హైదరాబాద్ టెక్కీపై పోలీసుల కేసు నమోదు**

**హైదరాబాద్, జూలై 27:** కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆ యువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేశాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. 3రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

**రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు: ఆర్ఎస్**

**హైదరాబాద్, జూలై 27:** వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని సోమవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కుడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

## సంపాదకీయం



# వ్యవస్థల వైఫల్యం

## రగులుతున్న యువత ఆగ్రహం!

### జవాబుదారీతనం కరువైతే ప్రజా ఉద్యమాలు తప్పవు

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జిఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృథా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం య-ువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్ధతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్మకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉదీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

# లోక్‌సభలో పేపర్ లీకేజీ సవరణ బిల్లు

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్ఠంభన
- మోడీ, అమిత్ షా క్షమాపణలకు విపక్షాల డిమాండ్



**న్యూఢిల్లీ, జూలై 27:** పార్లమెంట్ ఉభయసభల్లో సోమవారం కూడా ప్రతిష్ఠంభన కొనసాగింది. విద్యార్థులపై నమోదైన కేసులు ఎత్తివేయాలని, నిరసనకారులపై జరిగిన లాఠీచార్జీ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఉభయసభల్లో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభలను పలుమార్లు వాయిదా వేశారు. గందరగోళం మధ్యే కేంద్ర ప్రభుత్వం యాంటీ పేపర్ లీక్ (సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభ ముందుంచారు. బిల్లు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. అయితే విపక్ష సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో చర్చ ప్రారంభం కాలేదు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. నీట్, యూజీసీ-నెట్ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ నిందితులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుతం ఉన్న చట్టంలో గరిష్ఠ శిక్ష ఐదేళ్లు, జరిమానా రూ.10 లక్షల వరకు మాత్రమే ఉంది. పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. కేసు నమోదు అయిన తర్వాత రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, అనంతరం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో రోజువారీ విచారణ నిర్వహించి 90 రోజుల్లో తీర్పు వెలువరించాలని నిబంధనలు రూపొందించారు. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు, అప్పీల్‌పై కూడా 90 రోజుల్లో తీర్పు ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, ప్రశ్నపత్రాల లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ దిశగా సాంకేతిక సంస్కరణలు, పరీక్షల భద్రతపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసింది. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో పలు పరిపాలనా మార్పులు కూడా చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ బిల్లును విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. సమస్య మూలాలను పరిష్కరించకుండా పైపై చర్యలకే ప్రభుత్వం పరిమితమైందని ఆరోపించాయి. విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, సంబంధిత ఘటనపై ప్రధాని మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలని విపక్షాలు మరోసారి డిమాండ్ చేశాయి. దీంతో పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగింది.

# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్


**న్యూఢిల్లీ, జులై 27 :** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణిలే కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.



## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

### ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా

### చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం



**న్యూఢిల్లీ, జూలై 27:** నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూ డదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్  మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# కేంద్రం హామీలు బుట్టదాఖిలు

### కేసుల ఉపసంహరణపై కదలిక లేదు ■ మళ్లీ దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ హెచ్చరిక

### విద్యార్థులకు న్యాయసాయం కోసం 'సాక్షి' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

**న్యూఢిల్లీ, జూలై 27:** నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' ఆరోపించింది. హామీలను అమలు చేయకపోతే దేశవ్యాప్తంగా మరోసారి ఆందోళనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. పేపర్ లీక్ ఘటనపై జరిగిన నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత సీజేపీ తమ ఆందోళనను విరమించింది. కేంద్రంతో జరిగిన చర్చల్లో విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేస్తున్నారని, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరసనకారులపై నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యమానికి లాజిస్టిక్ సహాయం చేసిన వాలంటీర్లను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు న్యాయ సహాయం అందించేందుకు 'సాక్షి' పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులో ఉన్న విద్యార్థులను విడుదల చేయాలని, వాలంటీర్లపై నిఘా, వేధింపులు నిలిపివేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కేసులపై న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతున్నామని సౌరవ్ దాస్ తెలిపారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ అంశంలో తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు, నిర్బంధంలో ఉన్న వారిని విడుదల చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఢిల్లీ పోలీసులు లేదా కేంద్ర దర్యాప్తు సంస్థలు కొత్త కేసులు నమోదు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. లేదంటే తదుపరి కార్యాచరణ ప్రకటించి మళ్లీ దేశవ్యాప్త ఆందోళనలకు దిగుతామని అల్టిమేటం జారీ చేసింది. సోమవారం సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది, సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించడంతో జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గిన తర్వాత విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారనే అనుమానం తమకు ముందే ఉందని వ్యాఖ్యానించారు.



# చట్టం ఉంది.. బోర్డులు ఏవి?

## ప్రభుత్వ కార్యాలయాల్లో గాలికి వదిలేసిన 'ఆర్టీఐ'



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నిబంధనలు ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రతీకగా నిలిచిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)అమలు క్షేత్రస్థాయిలో నీరుగారి పోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఆర్టీఐ బోర్డులు చాలాచోట్ల కనిపించడమే లేదు. దీంతో సామాన్యులకు ఏ సమాచారం ఎవరిని అడగాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చట్టం తెచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, అధికారుల నిర్లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో దీని అమలు నామమాత్రంగా మారింది.

### కనిపించని బోర్డులు.. కొరవడిన పారదర్శకత

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ ఆర్టీఐ చట్టం కింద ఆ శాఖకు సంబంధించిన అప్పీలేట్ అథారిటీ, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐఓ) పేర్లు, ఫోన్ నెంబర్లు, హోదాలతో కూడిన బోర్డులను విధిగా ప్రదర్శించాలి. కానీ తహశీల్దార్ కార్యాలయాల నుంచి మొదలుకొని మున్సిపల్ ఆఫీసులు, పంచాయతీ రాజ్, విద్యా, వైద్య శాఖల వరకు చాలా చోట్ల ఈ నిబంధనను పూర్తిగా గాలికి వదిలేశారు. కొన్నిచోట్ల పాత బోర్డులు ఉన్నా, వాటిపై ఉన్న అధికారులు బదిలీ కావడంతో కొత్త పేర్లు అప్డేట్ చేయడం లేదు. మరికొన్ని కార్యాలయాల్లో అసలు బోర్డుల జాడే లేకపోవడం గమనార్హం.

### ఎవరిని అడగాలి సమాచారం?

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సామాన్యులకు సమాచార అధికారి ఎవరో తెలియక అవస్థలు పడుతున్నారు. బోర్డులు లేకపోవడంతో ఎవరికి దరఖాస్తు చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇది పరోక్షంగా అధికారుల బాధ్యతారహిత్యానికి దారితీస్తోంది.

### చట్టం ఉల్లంఘనే..

ఆర్టీఐ చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు తమ వివరాలను స్వచ్ఛందంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కానీ బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలను ప్రశ్నించకుండా ఉండేందుకే ఉద్దేశపూర్వకంగానే ఈ బోర్డులను ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వస్తే సమాచారం ఇవ్వాల్సి వస్తుందనే భయంతో కొందరు అధికారులు ఈ నిబంధనను అమలు చేయడం లేదని పౌర హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.

### తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసముంది..

జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డుల ఏర్పాటును పరిశీలించాలి. నిబంధనలను విస్మరించి బోర్డులు ఏర్పాటు చేయని అధికారులపై ఆర్టీఐ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. కేవలం భౌతిక బోర్డులే కాకుండా, ప్రతి శాఖ అధికారిక వెబ్సైట్లోనూ పీఐఓ వివరాలు స్పష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ప్రజాస్వామ్యంలో పౌరుడికి ఉన్న అత్యంత బలమైన ఆయుధం సమాచార హక్కు చట్టం. దీనిని అమలు చేయాల్సిన అధికారులే చట్టానికి తూట్లు పొడుస్తుంటే, పారదర్శకత ఎలా సాధ్యమనే ప్రశ్న పౌర సమాజం నుంచి గట్టిగా వినిపిస్తోంది. కాలయాపన చేయకుండా యంత్రాంగం ఇప్పటికైనా మేల్కొంటుందో లేదో వేచి చూడాలి.



# ఎమ్మార్పీ చెరిపి ఆహార పదార్థాల విక్రయం?

- జైనూర్లో వినియోగదారుల ఆందోళన..
- తనిఖీలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని కొన్ని కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపార కేంద్రాల్లో ప్యాకెట్ ఆహార పదార్థాలపై ముద్రించిన ఎమ్మార్పీను మార్కర్ పెన్తో చెరిపి కనిపించకుండా చేసి విక్రయిస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీంతో ఉత్పత్తి అసలు ధర ఎంత అనే విషయం వినియోగదారులకు తెలియక ఇబ్బందులు ఎదు-రవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎమ్మార్పీ కనిపించకుండా చేయడంతో అధిక ధరలకు వస్తువులను విక్రయించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ప్యాకెట్ ఆహార ఉత్పత్తులపై తయారీదారు ముద్రించిన ఎమ్మార్పీ, తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్ వంటి వివరాలు స్పష్టంగా కనిపించేలా ఉండాలని కోరుతున్నారు. ఎమ్మార్పీను మార్కర్ పెన్తో చెరిపివేయడం ద్వారా కనిపించకుండా చేయడం వినియోగదారుల హక్కులకు విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్యాకెట్ ఆహార పదార్థాలను కొనుగోలు చేసే ముందు ఎమ్మార్పీ, తయారీ తేదీ, గడువు తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని, అనుమానాస్పదంగా అనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని పలువురు సూచిస్తున్నారు.




# సింగరేణి పెన్షన్‌దారులకు ప్రమాద బీమా కల్పించాలి

### యూనియన్ బ్యాంక్ ఎదుట నల్లబ్యాడ్జీలతో ధర్నా

**ఉద్యమ కెరటం, తాండూర్:** సింగరేణి విశ్రాంత కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు రూ.30 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్లోని యూనియన్ బ్యాంక్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ నిశంత్కు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందినా, యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగిన 70 సంవత్సరాల లోపు కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు ఒప్పందం ప్రకారం రూ.30లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, యూనియన్ బ్యాంక్ మధ్య 2024 ఫిబ్రవరి 26న కుదిరిన ఒప్పందం ప్రకారం బీమా సౌకర్యాలు అమలు కావాల్సి ఉన్నప్పటికీ, గత రెండేళ్లుగా బ్యాంకు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంటనే బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ శాఖల ఎదుట విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసం రాజయ్య, తగరం రాజన్న, తోటపల్లి ఎల్లయ్య, దేవరకొండ మౌగిలి, కే. దుర్గాస్వామి, కే. లక్ష్మి, ఎర్రయ్య, సీ. రాయలింగు, ఎడ్ల గొంతయ్య, మాదారం, తాండూర్, తంగళ్లపల్లి, కొత్తపల్లి, కొత్తగుడిసెలు తదితర ప్రాంతాలకు చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.






# రక్తదానం ప్రాణదానంతో సమానం

### సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రక్తదానం ప్రాణదానంతో సమానం అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో కమల్ మిత్ర ఫార్మసీ, కమల్ మిత్ర మోటార్స్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం సత్తుపల్లి పట్టణం మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ముత్తుట్ ఎమ్ క్రెడ్ గోల్డ్ లోన్ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాఖ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన ఆర్థిక సేవలు అందించాలని సూచించారు. స్థానిక వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఆర్థిక సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, బ్యాంక్రృతినిధులు, రక్తదాతలు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలో సమస్యలపై చర్చ

### 102 అంబులెన్స్ సేవలు కల్పించాలని గ్రామస్తుల డిమాండ్



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఉపాధిహామీ పనులు, పెన్షన్లు, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సరఫరా, సంక్షేమ పథకాల అమలు, గృహ నిర్మాణాలు, గ్రామంలోని మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇస్తూ, గ్రామ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతిఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొన్నారు. గ్రామ సభలో జంగం గ్రామానికి అత్యవసర వైద్య సేవలైన 102 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులను సమయానికి ఆస్పత్రికి తరలించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. వెంటనే జంగం గ్రామానికి 102 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు రవీందర్, లక్ష్మణ్, కీర్తన్, నాసోరు, అంబిబాయి, లక్ష్మి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



**ఉద్యమ కెరటం, జైనూర్:** పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని గ్రామ సర్పంచ్ పెందూర్ అనసూయ అర్జున్ అన్నారు. సోమవారం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పరిశుభ్రతను అలవాటు చేసుకుని తమ పాఠశాలను అందంగా, పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఉప సర్పంచ్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పాఠశాలలతో విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సయ్యద్ మహెబూబ్, వార్డు సభ్యుడు కీర్తన్, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# సమస్యల పరిష్కారానికి సంఘాన్ని బలోపేతం చేయాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** రాష్ట్రోపాధ్యాయ సంఘం సంఘం విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతర పోరాటం చేస్తోందని, ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకుని సంఘాన్ని మరింత బలోపేతం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు అన్నారు. తాండూర్ మండలం రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు సంఘంలో సభ్యత్వం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 80 సంవత్సరాలుగా తమ సంఘం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మంచిర్యాల జిల్లాలోని కొన్ని మండలాల్లో 2024 వేసవి కాలంలో నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణా తరగతులకు సంబంధించిన సంపాదిత సెలవులు ఇప్పటికీ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు వెంటనే స్పందించి అర్హులైన ఉపాధ్యాయులకు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం పెండింగ్లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించి, పీఆర్సీ నివేదికను విడుదల చేసి కొత్త పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిబాబు, కృష్ణగౌడ్, రాజేంద్రప్రసాద్, సంతోష్, శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, సుకుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి తాళం పగులగొట్టి నగదు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి నగదు చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు బోథ్ ఎస్సై వి.పురుషోత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 24న బోథ్ పట్టణంలోని న్యూ కాలనీలో నివసిస్తున్న బాధితురాలు ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా, సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గుర్తించింది. మరుసటి రోజు ఇంట్లోని పెట్టెలో దాచిన రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, ఈనెల 26న అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది. నిందితుడు కృష్ణకాంత్ జాధవ్ నేరడిగొండ మండలం వాగ్దారి గ్రామానికి చెందినవాడని, ప్రస్తుతం బోథ్లో నివాసం ఉంటున్నట్లు గుర్తించాం. కూలీ పనితో వచ్చే ఆదాయం సరిపోక తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బాధితురాలి ఇంటి తాళం పగులగొట్టి నగదును చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడని తెలిపారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన నగదును స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్కు తరలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే ప్రజలు సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని సూచించారు.

# కొర్టికల్ ఆశ్రమ పాఠశాలకు పీజీ హెచ్ఎంను తిరిగి నియమించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కొర్టికల్(కె) ఆశ్రమ ఉన్నత పాఠశాలకు పీజీ హెచ్ఎంగా పనిచేసి పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి విశేష సేవలందించిన కాత్లే గంగారాంను తిరిగి అదే పాఠశాలకు నియమించాలని గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు కోరారు. సోమవారం ఐటీడీఏ పీఓ మంద మకరందుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ఏడాది ఇంద్రవెల్లి మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై కొర్టికల్ పాఠశాలకు వచ్చిన కాత్లే గంగారాం విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయులతో సమన్వయం చేస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఆయన నాయకత్వంలో గత మార్చిలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు నమోదు చేసిందని కొనియాడారు. ప్రస్తుతం కాత్లే గంగారాం డిప్యూటేషన్పై మేడిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు వెళ్లారని, ఆయన సేవలు కొర్టికల్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి ఆయనను తిరిగి తమ గ్రామంలోని పాఠశాలకు నియమించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ పటేల్ సిడం జనార్దన్, గ్రామ పూజారి సెడ్మకి మాణిక్రావు, సర్పంచ్ ఆత్రం భీంరావు, మాజీ సర్పంచ్ ఆత్రం నగేష్, మాజీ ఎంపీటీసీ ఆత్రం సుగుణతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి



## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజావాణి ద్వారా అందుతున్న ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఉపాధి హామీ, భూభారతి సమస్యలకు సంబంధించి మొత్తం 97 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను 30 రోజుల్లోగా, అప్పీల్ కేసులను మూడు రోజుల్లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని, ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి వివరాలను సంబంధిత పోర్టల్లో ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు సూచించారు. అనంతరం భీంపూర్ గ్రామానికి చెందిన భారే కళావతి తన పట్టా భూమికి సంబంధించిన సమస్య పదేళ్లుగా పెండింగ్లో ఉండగా, ఇటీవల పరిష్కారం కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి కలెక్టర్ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

### 29న పంచాయతీల పాలనపై ప్రత్యేక సమీక్ష

గ్రామ పంచాయతీల అభివృద్ధి, పాలనా పురోగతిపై ఈనెల 29న మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి 45 రోజులకు ఒకసారి ఈ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. సమీక్షలో జీపీ యాప్ నిర్వహణ, తడి--పొడి చెత్త వేరు చేసే విధానం, పారిశుధ్యం, జల్ జీవన్ మిషన్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. తహశీల్దార్లు, వైద్యులు, వ్యవసాయ అధికారులతో పాటు అన్ని ముఖ్య శాఖల అధికారులు సమావేశాలకు హాజరై, చర్చించిన అంశాలపై నివేదికలను డీపీఓ, జెడ్పీ సీఈఓలకు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, ఏఓ వర్ణ, జెడ్పీ సీఈఓ రవి, డీపీఓ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** హైదరాబాద్లోని గచ్చిబౌలిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్లో స్థానం సంపాదించిన ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడ ఆదర్శ పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. తైక్వాండో విభాగంలో గిన్నిస్ రికార్డు సాధించిన 9వ తరగతి విద్యార్థిని చైత్ర, కూచిపూడి విభాగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఇంటర్మీడియట్ విద్యార్థిని సంజనకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంగారుగూడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, జెడ్పీహెచ్ఎస్ బరంపూర్ ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, తైక్వాండో శిక్షకులు జి.ప్రవీణ్, ఉపాధ్యాయులు చిందం ఆశన్న, విద్యార్థుల తల్లిదండ్రులు మంజుల, నితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తుడుం దెబ్బ, ఆదివాసి విద్యార్థి నూతన కమిటీల ఎన్నిక





**ఉద్యమ కెరటం, తాండూర్:** తుడుందెబ్బ మండల నూతన కమిటీతో పాటు ఆదివాసి విద్యార్థి మండల కమిటీలను సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తుడుందెబ్బ మండల గౌరవ అధ్యక్షుడిగా అల్లంకొండ భీమన్న, మండల అధ్యక్షుడిగా యాపల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా బుర్సా ప్రవీణ్ ఎన్నికయ్యారు. అలాగే ఆదివాసి విద్యార్థి మండల అధ్యక్షుడిగా పసుల ధర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆలకుంట అంజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన కోసం సంఘం మరింత బలోపేతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ స్థాయి నుంచి ఆదివాసీ యువత, విద్యార్థులను సంఘటితం చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెంద్రం హనుమంత్, జాతీయ ఉపాధ్యక్షుడు ఆడ జంగు, రాష్ట్ర కార్యదర్శి మండిగ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మణికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సెంగ బాబురావు, జిల్లా కార్యదర్శి అరికేల శంకర్, తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏయిర్పోర్టు భూసేకరణకు నిధుల మంజూరు

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ ఏయిర్పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బాణసంచాలు పేల్చి పరస్పరం మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఏయిర్పోర్టు భూసేకరణ కోసం నిధులు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ప్రశంసించారు. సీఎం తన ఎన్నికల ప్రచారాన్ని ఇంద్రవెల్లి నుంచి ప్రారంభించి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదిలాబాద్ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఆ హామీలో భాగంగానే ఏయిర్పోర్టు నిర్మాణానికి తొలి అడుగుగా భూసేకరణ కోసం రూ.2,278.14 కోట్ల నిధులను కేటాయించడం జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ఏయిర్పోర్టు నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలోనే ఆదిలాబాద్ ఏయిర్పోర్టు నిర్మాణ అంశాన్ని పార్లమెంట్లో ప్రస్తావించానని గుర్తు చేశారు. తన హయాంలోనే ఆర్ఓబీ పనులకు సంబంధించిన తుది స్థల సర్వే పూర్తయిందని, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కోసం కూడా పార్లమెంట్ వేదికగా గళం విప్పానని తెలిపారు. ఆదిలాబాద్ ప్రజల చిరకాల స్వప్నమైన ఏయిర్పోర్టు నిర్మాణానికి భూసేకరణ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖీజర్ పాషా, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గౌలి సంజీవ్ కుమార్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు బెజ్జంకి అనిల్ కుమార్, బండారి సతీష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్, కాంగ్రెస్ మైనారిటీ విభాగం చైర్మన్ సయ్యద్ షాహిద్ అలీ, మల్యాల కరుణాకర్, బండి దేవదాస్ చారి, అక్తర్ అలీ, మందాకిని, ఇమ్రాన్ బేగ్, సిరాజుద్దీన్, సంతోష్, వెంకట్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ అన్నపూర్ణతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్‌కు ఏయిర్‌పోర్టు చారిత్రాత్మక నిర్ణయం



## మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్‌కు ఏయిర్‌పోర్టు మంజూరు చారిత్రాత్మక నిర్ణయమని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ప్రజల చిరకాల స్వప్నమైన ఏయిర్‌పోర్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2,278.74 కోట్లను మంజూరు చేస్తూ జీఓ జారీ చేయడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం 2009లోనే ఏయిర్‌పోర్టు తీసుకొస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. శీయిర్పోర్టు అందుబాటులోకి వస్తే ఆదిలాబాద్ ప్రాంత రైతులు తమ పంటలు, కూరగాయలను ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు సులభంగా ఎగుమతి చేసుకునే అవకాశం ఏర్పడి, మెరుగైన ధరలు పొందగలరని చెప్పారు. డిసెంబర్ 31 నాటికి భూసేకరణ, విద్యుత్ లైన్ల మార్పిడి వంటి పనులు పూర్తి చేసి ఏయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ ఏయిర్‌పోర్టుతో ఆదిలాబాద్ జిల్లాతో పాటు సుమారు 150 కిలో మీటర్ల పరిధిలోని ప్రజలు, రైతులు, వ్యాపారవేత్తలకు విశేష ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖీజర్ పాషా, హిమ అభిషేక్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీలు బండి దేవిదాస్ చారి, కరుణాకర్, సంజీవ్ గౌలే, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు అనిల్, జిల్లా మైనారిటీ నాయకుడు సయ్యద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ప్రేమల, జ్యోతి, కమ్మర్ బేగం, మందాకిని, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ చరణ్ గౌడ్, అలీమ్, ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తిగా మల్లూరు జీవితం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సమాజసేవకు అంకితభావంతో జీవించి, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కోసం తన పెద్ద కుమారుడిని అంకితం చేసిన అమరజీవి మల్లూరు వెంకట సత్యనారాయణ యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో గల కర్మల భవనంలో మల్లూరు వెంకట సత్యనారాయణ తొలి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి దూరంగా ఉండి, ఎవరికీ హాని చేయకుండా కుటుంబాన్ని పోషిస్తూ ఆదర్శ జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అంగవైకల్యం ఉన్నప్పటికీ దానిని లెక్కచేయకుండా వేలాది కిలో మీటర్లు కాలినడకన ప్రయాణిస్తూ కార్మికులు, కూలీల నివాస ప్రాంతాల్లో చిరు వ్యాపారం చేసి జీవనం సాగించారని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్రావు, ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర నాయకుడు మెరుగు సత్యనారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఆస్తులు కూడబెట్టడం కోసం కాకుండా నిరాడంబరంగా, నిస్వార్థంగా జీవించిన వ్యక్తిగా మల్లూరు వెంకట సత్యనారాయణను గుర్తు చేసుకున్నారు. సత్తుపల్లి ప్రాంత ప్రజలు ప్రేమగా "క్యాలెండర్ల బాబాయి"గా పిలిచే మల్లూరు వెంకట సత్యనారాయణ మరణంతో ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారని, ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం మల్లూరు వెంకట సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లూరు పద్మావతి, మల్లూరు చంద్రశేఖర్, మల్లూరు మోహన్, పట్టణ గుమస్తాల సంఘం అధ్యక్షుడు అల్లంశెట్టి రాంబాబు, రత్నాకర్, మోహన్, జర్నలిస్టులు ఆరెంపుల హరిబాబు, తోట నాని, తెలుగుదేశం నాయకులు పోట్రు రామారావు, తిమ్మిడి రాంబాబు, చల్లగుల్ల అప్పారావు, పలగాని రమ్య, ఉండవల్లి శ్రీకాంత్, వేంసూరు మండల సీపీఎం నాయకులు డంకర శ్రీను, బూరుగు శ్రీదేవి, సోనాక్షి, తుంగా నాగరాజు, కోటి, టోపీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన ఆముర్ల కృష్ణ తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తన పిల్లలకు జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలని దరఖాస్తు సమర్పించారు. కన్నెపల్లి మండలానికి చెందిన గాండ్ల మల్లేష్, గాండ్ల తిరుపతి తమ తాతల నుంచి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, సమగ్ర విచారణ జరిపి నకిలీ పట్టాను రద్దు చేసి తమ పేరున పట్టా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సురిమిల్ల పెద్దయ్య తన భూమి విస్తీర్ణం ఆన్లైన్లో తక్కువగా నమోదైందని, పరిశీలించి సవరణ చేయాలని కోరారు. మందమర్రి మండలానికి చెందిన కె.కృష్ణవేణి తాను గురుకుల పాఠశాలలో హెల్త్ సూపర్వైజర్గా పనిచేస్తున్నానని, ఈ ఏడాది ఆటో రెన్యువల్ చేయాలని వినతిపత్రం అందజేశారు. భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్తినేని రాజేశం ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతినడంతో తనకు దివ్యాంగుల వాహనం మంజూరు చేయాలని కోరగా, మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన బానోత్ రాజు తనకు తెలియకుండా నకిలీ పత్రాలతో తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్కు చెందిన రవికుమార్ తాను, తన భార్య ఇద్దరూ దివ్యాంగులమని, రెండు పడక గదుల ఇల్లు, అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన దుమల్ల అరుణ్కుమార్ తన తండ్రి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ మరణించారని, కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు



**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రం సమీపంలోని ప్రసిద్ధ దత్తాత్రేయ స్వామి పుణ్యక్షేత్రాన్ని టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సభాపతి శర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రప్రకాశ్ శర్మ, సూర్యప్రకాశ్ శర్మ ప్రత్యేక అర్చనలు నిర్వహించి, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో బండారు యాదగిరిని సత్కరించారు. ఈ సందర్భంగా బండారు యాదగిరి మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి పుణ్యక్షేత్రానికి సుమారు 650 సంవత్సరాల చరిత్ర ఉందని తెలిపారు. ప్రతి ఏడాది గురుపౌర్ణమి సందర్భంగా మూడు రోజులపాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం విశేషమని, స్వామివారిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆలయ చైర్మన్ సభాపతి శర్మ మాట్లాడుతూ హైదరాబాద్తో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని, గణపతి పూజ, చండీ హోమం, దీప ప్రజ్వలన, దత్తాత్రేయ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మాజీ ప్రధాన కార్యదర్శి పానుగంటి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్, వెన్న చక్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాకారుడిని పరామర్శించిన టీజీఐడీసీ చైర్మన్ విజయబాబు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** క్రీడల్లో పాల్గొంటున్న సమయంలో గాయపడిన ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కాటేపల్లి కిరణ్ కుమారుడిని టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి క్రీడా ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేలో అర్హులైన ప్రతి ఒక్కరినీ నమోదు చేసి, సర్వేను వంద శాతం విజయవంతం చేయాలని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అధికారులను, బీఎల్ఏలను కోరారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలోని పావుర్గూడ, రావుజీగూడ, ముస్లింగూడ, కొత్త పావుర్గూడ తదితర గిరిజన గ్రామాలు, గూడాల్లో విస్తృతంగా పర్యటించారు. బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి, ప్రజల వివరాల నమోదుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ సర్వే అత్యంత కీలకమైన ప్రక్రియ అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి అర్హుడి వివరాలు తప్పకుండా నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా అధికారులకు సరైన సమాచారం అందించి సర్వేను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను కూడా పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ రషీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ముఖీద్, జిల్లా సభ్యుడు పెందూర్ ప్రకాష్, పావుర్గూడ సర్పంచ్ తొడ్సం రాజేందర్, పోలస సర్పంచ్ బావురావు, బీఎల్ఏ సూపర్వైజర్ కోటేశ్వర్, మైముద్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఉపాధ్యాయులకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. సోమవారం హాజీపూర్ మండలం ముల్కల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ తిరుపతి రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, కార్యాచరణ ఆధారిత బోధన, వినూత్న బోధన విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థిలో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎంపికైన ఫౌండేషన్ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పీజీఐ సూచికల్లో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణలో బోధన-అభ్యాస ప్రక్రియను మరింత ప్రభావవంతంగా రూపొందించడం, విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించడం, తరగతి గది నిర్వహణలో ఆధునిక విధానాలను అమలు చేయడం వంటి అంశాలపై మాస్టర్ ట్రైనర్లు, నిపుణులు సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ జంబోజు సత్తయ్య, హాజీపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఎంఐఎస్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ఫౌండేషన్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# నిబంధనలకు పాతర?

**వసతి గృహాల టెండర్లలో అక్రమాల ఆరోపణలు ■ సీల్డ్ టెండర్లకు బదులు ఓపెన్ టెండర్లు!**

**బ్లాక్‌లిస్ట్ కాంట్రాక్టర్లకూ అవకాశం కల్పించారనే విమర్శలు ■ ప్రభుత్వ నిధుల దుర్వినియోగమంటూ కాంట్రాక్టర్ల ఆవేదన**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని గురుకుల, జ్యోతిబా పూలే, ఆదర్శ పాఠశాలల వసతి గృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, గ్యాస్ తదితర సరఫరాల కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. నిబంధనల ప్రకారం సీల్డ్ టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, ఓపెన్ టెండర్లు స్వీకరించారని, బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పించారని టెండర్లలో పాల్గొన్న పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని ఐదు జ్యోతిబా పూలే పాఠశాలలు, కళాశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు, నాలుగు మైనారిటీ గురుకులాలు, రెండు ఆదర్శ పాఠశాలలకు సంబంధించి టెండర్లు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఒకే కాంట్రాక్టర్‌కు దాదాపు 15 విద్యాసంస్థల సరఫరా బాధ్యతలు దక్కేలా కొందరు అధికారులు సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు సరఫరా చేయడానికి ముందుకొచ్చిన అర్హులైన కాంట్రాక్టర్లను పక్కనపెట్టి, ఎక్కువ ధర కోట్ చేసిన వారికి టెండర్లు కట్టబెట్టడం వల్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని, ఇటీవల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కూడా ఫిర్యాదు సమర్పించినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. గురుకుల టెండర్లలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసంఘాలు, బాధిత కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

– ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్




# ఉపాధి కల్పన పథకంలో అవకతవకలపై విచారణ జరపాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం అమలులో చోటుచేసుకుంటున్నట్లు అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోతు విజయ్ అన్నారు. సోమవారం బీజేపీ నాయకులతో కలిసి ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలోని సంబంధిత బ్యాంక్ల ప్రాంతీయ మేనేజర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని కొందరు ఆర్థికంగా బలమైన వ్యక్తులు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన వారు కూడా ఈ పథకం కింద రుణాలు పొందుతూ, సబ్సిడీ కోసం పేరుకే పరిశ్రమలు, సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. రుణాల మంజూరులో మధ్యవర్తులు, ప్రభావశీలులు, కొందరు అధికారుల ప్రమేయం ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేకుండానే రుణాలు మంజూరు చేస్తున్నారనే సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పథకం కింద మంజూరైన అన్ని రుణాలపై సమగ్ర విచారణ చేపట్టి, యూనిట్లు నిజంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారా, క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పత్రాలతో, అక్రమ మార్గాల్లో సబ్సిడీలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అర్హులైన నిరుద్యోగ యువతకు పారదర్శకంగా రుణాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టి, ప్రజా ధనం నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి మంద శివ, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, కార్తీక్ యాదవ్, అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బోడ మహేందర్ కుటుంబానికి న్యాయం చేయాలి



**ఉద్యమ కెరటం, ములుగు:** బోడ మహేందర్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా మాల మహానాడు ప్రతినిధులు ములుగు అదనపు కలెక్టర్ మహేందర్జీని కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బోడ మహేందర్ ఆత్మహత్యకు గల కారణాలపై నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అదనపు కలెక్టర్ సంబంధిత అంశాన్ని పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాల మహానాడు నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో లబ్ధి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రస్తుత ఎల్నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, రానున్న మూడు నెలల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యత తగ్గే అవకాశమున్నందున వరి సాగులో నష్టాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్పామ్ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటల సాగుపై దృష్టి సారించాలని




అన్నారు. రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటల సాగుపై రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం భీమారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మోడల్ ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి పాల్గొన్నారు. అలాగే మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిశీలన పురోగతిని సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బీఎల్ఏల ద్వారా మిగిలిన ఫారాలను సేకరించి బూత్ స్థాయి అధికారులకు అందించాలని సూచించారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత్ డబుల్ ధమాకా

**ఈషాకు గోల్డ్, మనుకు బ్రాంజ్..**




గిన ఫ్రాన్స్‌ను 2-0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు. ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది. విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా-ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

## పట్టువదలని జ్ఞానేశ్వరి.. కామన్వెల్త్‌లో వెండి వెలుగు

**53 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించిన భారత లిఫ్టర్**

**హోరాహోరీ పోరులో పసిడికి చేరువగా నిలిచిన జ్ఞానేశ్వరి యాదవ్**




**గ్లాస్గో, జూలై 27:** కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ల పతకాల పంట కొనసాగుతోంది. ఇప్పటికే మీరాబాయి చాను, రిషికాంత్ సింగ్, రాజా ముత్తుపాండీలు పతకాలు సాధించగా.. తాజాగా భారత వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ దేశానికి మరో రజత పతకాన్ని అందించింది. సోమవారం జరిగిన మహిళల 53 కిలోల విభాగం ఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జ్ఞానేశ్వరి, చివరి వరకు స్వర్ణ పతకం కోసం పోరాడి వెండితో సరిపెట్టుకుంది. స్నాచ్ విభాగంలో తొలి ప్రయత్నంలో 82 కిలోలు ఎత్తిన జ్ఞానేశ్వరి, రెండో ప్రయత్నంలో 85 కిలోలు, మూడో ప్రయత్నంలో 88 కిలోలు విజయవంతంగా ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. అయితే నైజీరియాకు చెందిన ఒనొమె ఒమొలోలా దిదిహ్ 90 కిలోలు ఎత్తి ఆధిక్యంలో నిలవడంతో స్వర్ణ పతక పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది. అనంతరం క్లిన్ అండ్ జర్క్ విభాగంలోనూ జ్ఞానేశ్వరి ధైర్యంగా పోటీ కొనసాగించింది. తొలి ప్రయత్నంలో 103 కిలోలు, రెండో ప్రయత్నంలో 107 కిలోలు విజయవంతంగా ఎత్తింది. చివరి ప్రయత్నంలో 111 కిలోలు లిఫ్ట్ చేసి తన పట్టుదలను చాటుకుంది. ప్రత్యర్థి ఒనొమె కూడా అదే బరువును విజయవంతంగా ఎత్తడంతో మొత్తం 199 కిలోల బరువును ఎత్తిన జ్ఞానేశ్వరి రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ల ఖాతాలో మరో విలువైన పతకం చేరింది. గాయాలు, ఒత్తిళ్లను అధిగమిస్తూ అద్భుత ప్రదర్శన చేసిన జ్ఞానేశ్వరి యాదవ్ యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆమె సాధించిన ఈ రజత పతకం భారత వెయిట్‌లిఫ్టింగ్‌కు మరో గర్వకారణంగా నిలిచింది.



## మృణాల్-యశస్వి డేటింగ్ రూమర్స్

**వైరల్ వీడియోతో మొదలైన చర్చ**

**ముంబై:** బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ డేటింగ్ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ వార్తలకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. ముంబైలోని ఓ ప్రముఖ కేఫ్ వద్ద జరిగిన ఘటనతో ఈ ప్రచారం మొదలైంది. ముందుగా మృణాల్ ఠాకూర్ కేఫ్‌లోకి వెళ్లగా, కొంతసేపటి తర్వాత అదే కేఫ్ నుంచి యశస్వి జైస్వాల్ బయటకు వస్తూ కెమెరాలకు చిక్కారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇద్దరూ కలిసి సమయం గడిపారని, ప్రేమలో ఉన్నారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. అయితే, ఒకే ప్రదేశంలో కనిపించడమే డేటింగ్‌కు నిదర్శనం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రకటన చిత్రీకరణ, బ్రాండ్ ప్రమోషన్ లేదా వృత్తిపరమైన సమావేశం కోసం ఇద్దరూ అక్కడికి వచ్చి ఉండొచ్చని కూడా చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలేనని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ మధ్య సుమారు తొమ్మిదేళ్ల వయసు తేడా ఉండటంతో దీనిపై కూడా సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. కొందరు కామెంట్లు చేస్తుండగా, మరికొందరు సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండా ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఠాకూర్ గానీ, యశస్వి జైస్వాల్ గానీ స్పందించలేదు. దీంతో ఈ వార్తలను అధికారికంగా ధృవీకరించే సమాచారం బయటకు రాలేదు. ఇదిలా ఉండగా, మృణాల్ ఠాకూర్ పేరు గతంలో కూడా పలువురు సినీ ప్రముఖులతో ముడిపడి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా నటుడు ధనుష్‌తో ఆమె పెళ్లి చేసుకోబోతున్నారంటూ వచ్చిన ప్రచారాన్ని ఆమె సన్నిహితులు ఖండించారు. ప్రస్తుతం మృణాల్ వరుస సినిమాలతో బిజీగా ఉండగా, యశస్వి జైస్వాల్ భారత క్రికెట్ జట్టులో యువ స్టార్‌గా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ డేటింగ్ ప్రచారంపై ఇద్దరిలో ఎవరైనా స్పందిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## వైభవ్ బ్యాట్ మళ్లీ గర్జించేది ఎప్పుడు?

**తదుపరి మ్యాచ్ కోసం అభిమానుల ఎదురుచూపులు**

**న్యూఢిల్లీ, జూలై 27:** జింబాబ్వే పర్యటనలో అద్భుత ఆటతీరుతో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండు అర్ధశతకాలతో మెరిసిన ఈ 15 ఏళ్ల యువ బ్యాటర్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సొంతం చేసుకుని తన ప్రతిభను చాటుకున్నాడు. హరారే వేదికగా అతని దూకుడు బ్యాటింగ్ అభిమానులతో పాటు మాజీ క్రికెటర్ల ప్రశంసలు కూడా అందుకుంది. వైభవ్ ఆటపై స్పందించిన భారత మాజీ వికెట్‌కీపర్ ఫరూక్ ఇంజనీర్.. అతడికి వన్డే జట్టులో కూడా అవకాశం కల్పించాలని సూచించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి ప్రదర్శన చేయడం అరుదైన విషయమని కొనియాడారు. అయితే వైభవ్ అభిమానులు అతడి తదుపరి మ్యాచ్ కోసం కొంతకాలం వేచి చూడాల్సి ఉంటుంది. భారత జట్టు తర్వాత శ్రీలంక పర్యటనలో రెండు టెస్టుల సిరీస్ ఆడనుండగా, వైభవ్ టెస్ట్ జట్టులో చోటు దక్కించుకోలేదు. దీంతో ఆ సిరీస్‌లో అతను బరిలోకి దిగే అవకాశం లేదు. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో భారత్ స్వదేశంలో ఆడనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌లో వైభవ్ మళ్లీ కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయి. మూడు వన్డేల అనంతరం జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు అతను ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. వెస్టిండీస్‌తో తొలి టీ20 మ్యాచ్ అక్టోబర్ 6, 2026న లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో జరగనుంది. జింబాబ్వే పర్యటనలో తన బ్యాట్‌తో మెరుపులు మెరిపించిన వైభవ్ సూర్యవంశీ, మరోసారి భారత జెర్సీలో పరుగుల వరద పారిస్తాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతని బ్యాట్ నుంచి వచ్చే భారీ సిక్సర్లు, ఆకర్షణీయమైన ఫోర్లు మరోసారి చూడాలని క్రికెట్ అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## భారత్ ఖాతాలో మరో పతకం

**వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం గెలుచిన రాజా ముత్తుపాండి ● కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారుల జోరు**



**గ్లాస్గో:** చాలా కాలం తర్వాత గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటుతున్నారు. తాజాగా వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. పురుషుల 65 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకాన్ని కైవసం చేసుకుని దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఫైనల్లో రాజా ముత్తుపాండి స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి మొత్తం 286 కిలోగ్రాముల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిదిన్ ముహమ్మద్ అసాధారణ ప్రతిభ కనబరిచారు. మొత్తం 299 కిలోగ్రాములు ఎత్తి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడంతో పాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఇక పాపువా న్యూ గినియాకు చెందిన మోరేయా బారు కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. చివరి వరకు తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, రాజా ముత్తుపాండి తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని రజత పతకాన్ని ఖరారు చేసుకున్నారు. ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో భారత్ సాధించిన పతకాల సంఖ్య మరింత పెరిగింది. రాజా ముత్తుపాండి క్రీడా ప్రయాణం ఎన్నో కష్టనష్టాలతో సాగింది. 2017లో యూత్ కామన్వెల్త్ గేమ్స్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు గెలిచిన ఆయన, 2019లో లిగమెంట్ గాయం కారణంగా కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌నకు దూరమయ్యారు. శస్త్రచికిత్స అనంతరం చాలా కాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. 2021లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానం సాధించినా, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించలేకపోయారు. అయినా వెనకడుగు వేయని రాజా, కఠిన సాధనతో తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. 2024లో 61 కేజీల విభాగంలో జాతీయ రికార్డును బద్దలు కొట్టిన ఆయన, 2025 కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లోనూ రజతం సాధించారు. ఇప్పుడు గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలిచి తన పట్టుదలను చాటుకున్నారు. తదుపరి లక్ష్యంగా లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకం సాధించిపెట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
28 జూలై 2026




# ఆదర్శ కుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.


## 52 ఏళ్ల వయసులోనూ

# తగ్గేదేలే..

బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ మలైకా అరోరా తన వ్యక్తిగత జీవితంతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. సినిమాల కంటే ప్రేయ వ్యవహారాల కారణంగానే సోషల్ మీడియాను షేక్ చేస్తుంటారు. యంగ్ హీరో అర్జున్ కపూర్‌తో సుదీర్ఘ బంధానికి స్వస్తి చెప్పిన తర్వాత, ఆమె లైఫ్‌లోకి మరో కొత్త వ్యక్తి ఎంట్రీ ఇచ్చారనే వార్త ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం.. మలైకా ప్రముఖ డైమండ్ వ్యాపారి హర్ష్ మెహతాతో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముంబైలోని బాంద్రాలో జరిగిన ఒక గ్రాండ్ ప్రైవేట్ పార్టీకి మలైకా తన కొడుకు అర్హాన్ ఖాన్‌తో కలిసి హాజరయ్యారు. అదే పార్టీలో హర్ష్ మెహతా కూడా సందడి చేయడంతో వీరిద్దరి రిలేషన్‌షిప్‌పై వచ్చే రూమర్లకు మరింత బలం చేకూరింది. 52 ఏళ్ల మలైకా, తనకంటే 19 ఏళ్లు చిన్నవాడైన హర్ష్ మెహతాతో డేటింగ్ చేయడంపై సోషల్ మీడియా వేదికగా విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. గతంలో తనకంటే 12 ఏళ్లు చిన్నవాడు అర్జున్ కపూర్ విషయంలో ఎదుర్కొన్న విమర్శల తరహాలోనే, ఇప్పుడు కూడా నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు.



# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్



## జైన్ కులం, మతంపై విమర్శలు..

## పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు. తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలని యువతకు సూచించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**